క్లుప్తంగా

నిజాయితీ చాటుకున్న వ్యాపారి



సూర్యప్రకాష్ బంధువులకు పర్సును అందజేస్తున్న ట్రస్టీలు

మామిడికుదురు: ఖమ్మం జిల్లా వెంకటాపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన వేముల సూర్యప్రకాష్ అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దర్శనానికి వచ్చి గురువారం పర్స్ పడేసుకున్నాడు. ఈ పర్స్ స్థానిక ఫ్యాన్సీ షాపు యజమాని కామిశెట్టి ప్రసాద్ (చిన్న)కు దొరికింది. దీన్ని దేవస్థానం ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్‌కు చిన్న అందజేశాడు. దేవస్థానం ఉద్యోగులు సూర్యప్రకాష్‌కు ఈ సమాచారం అందించారు. అతని బంధువులకు శుక్రవారం పర్సుతో పాటు దానిలో ఉన్న రెండు ఏటీఎం కార్డులు, ఆధార్‌కార్డు, ఫొటోలు, రూ.14 వేలు నగదును ట్రస్టు బోర్డు సభ్యులు కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్, చిట్టాల సత్తిబాబు, దేవస్థానం ఉద్యోగులు అందజేశారు. వ్యాపారి చిన్నను ట్రస్టు బోర్డు సభ్యులు, ఉద్యోగులు అభినందించారు.

ఆరుగురు వీఓఏలకు ప్రశంసాపత్రాలు

మామిడికుదురు: స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరు, సభ్యులకు బీమా పాలసీ, ఎక్కువ మొత్తంలో పొదుపు చేయడం, రుణాల చెల్లింపు తదితర అంశాల్లో అవగాహన కల్పించిన ఆరుగురు విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్ (వీఓఏ)కు శుక్రవారం ప్రశంసాపత్రాలు అందించారు. రాజమహేంద్రవరంలో జరిగి శిక్షణా సమావేశంలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. యూనియన్ బ్యాంకు రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ డైరెక్టర్ టి.శ్రీనివాసరావు చేతుల మీదుగా వీటిని అందజేశారు. వీఓఏలు పెదపట్నంలంక-2 మేడిద విజయ, పాశర్లపూడి-4 సానబోయిన వరలక్ష్మి, బి.దొడ్డవరం-1 పి.సుశీల, పాశర్లపూడిలంక-3 జి.నిరీష, మామిడికుదురు-3 కొమ్ముల మణి, ఈదరాడ-2 భవాని ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

ఆలయ పరిసరాల్లో శానిటేషన్ పనులు

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయ పరిసర ప్రాంతాల్లో స్థానిక పంచాయతీ యంత్రంతో చేపట్టిన పనులను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పరిశీలించారు. ఆలయ ప్రాకారం చుట్టూ ఈ పనులను దగ్గర ఉండి ఆయన పర్యవేక్షించారు. అలాగే ఆలయానికి ఉత్తరం వైపు నున్న టాయిలెట్స్ పరిశుభ్రత గురించి సిబ్బందితో సమీక్షించారు. ఇక్కడ నీటి కొరత లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

పి.గన్నవరం: మండలంలోని నాగుల్లంక గ్రామం వద్ద ఈనెల 17న ప్రమాదవశాత్తూ ప్రధానపంట కాలువలో పడి గల్లంతైన దారా రాంబాబు (35) మృతదేహం మలికిపురం మండలం టేకిశెట్టిపాలెం వద్ద శుక్రవారం లభ్యమైంది. మృతదేహానికి రాజోలు ప్రభుత్వాస్పత్రి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పి.గంగాభవాని తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

అయినవిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.మధుసుదన్ శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. అయినవిల్లిలంకలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. అయినవిల్లిలంకలో కొబ్బరి పళ్లాల పనులను ఆయన పరిశీలించారు. అనంతరం వారితో మాట్లాడారు. కూలీలకు సక్రమంగా వేతనాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన వెంట ఏపీఓ నాగబాబు, జేఈ కుమార్‌దాసు, టెక్నికల్ అసిస్టెంట్ కె.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులు

పి.గన్నవరం: మండలంలోని మూడు గ్రామాల్లో శనివారం నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ టీఎస్ ఆచార్య తెలిపారు. 21న మొండెపులంక, 23న మానేపల్లి, 24న వాడ్రేవుపల్లి గ్రామాల్లో ఆధార్ క్యాంపులు జరుగుతాయని వివరించారు. పాత ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయడంతో పాటు, కార్డుల్లో ఏమైనా తేడాలను ఉంటే సరిదిద్దుతారని తెలిపారు. ఈ క్యాంపులను సద్వినియోగంచేసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలకు ఆచార్యులు విజ్ఞప్తి చేశారు.

అగ్నిప్రమాద బాధితురాలికి ఆర్థిక సాయం

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెంలో అగ్నిబాధితురాలు పేరాబత్తుల సుబ్బలక్ష్మికి, శివకోడు తెలగ సంక్షేమ సంఘం శుక్రవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసింది. ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిబూడిదై, కట్టుబట్టలతో ఆమె మిగిలింది. తులా సత్యనారాయణ, కుంపట్ల చిన్నారి, నామన నాగభూషణం, బెల్లంకొండ అబ్బులు, దూది స్వామి, బోణం సాయి, రేకపల్లి వేణు, వై.తాతాజీ, మెండు శ్రీను, బాబినాయుడు పాల్గొన్నారు.

అప్పనపల్లి ఆర్అండ్‌బీ రోడ్డుకు మహర్దశ

రూ.12 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణం



అప్పనపల్లిలో ఆధునీకరణకు నోచుకున్న ఆర్అండ్‌బీ రోడ్డు

మామిడికుదురు: ఎంతో కాలం నుంచి అధ్వానంగా ఉన్న అప్పనపల్లి ఆర్అండ్‌బీ రోడ్డుకు మహర్దశ పట్టింది. ప్రస్తుతం ఉన్న బ్లాక్‌టాప్ రోడ్డు స్థానే పక్కా సిమెంట్ కాంక్రీట్ రోడ్డు (సీసీ) రోడ్డు నిర్మిస్తున్నారు. గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకుని 12 అంగుళాల ఎత్తు పెంచి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. గత నెలలో చేపట్టిన ఈ రోడ్డు ఆధునీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పాశర్లపూడి నుంచి అప్పనపల్లి వరకు రూ.12 కోట్లతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఆర్అండ్‌బీ రోడ్డు ఆధునీకరణలో భాగంగా ఏటా ఒక మాదిరి గోదావరి వరదకే ముంపు బారినపడుతున్న అప్పనపల్లి కాజ్‌వే ఎత్తును కూడా గణనీయంగా పెంచనున్నారు. ముంపు నుంచి విముక్తి కలిగించే విధంగా రూ.4 కోట్లతో కాజ్‌వే నిర్మిస్తారు. మరో రూ.8 కోట్లతో మూడు కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు ఏర్పాటు చేయనున్నారు. 18 అడుగుల వెడల్పు, ఐదడుగుల అప్రోచ్ రోడ్డుతో సహా 23 అడుగుల వెడల్పుతో పక్కా సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మాణం జరుగుతుంది. ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను పూర్తిగా తొలగించి, రోడ్డును వెడల్పు చేశారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి దేవస్థానానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. ఎంతో కాలంగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు అభివృద్ధికి ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చొరవతో నిధులు మంజూరయ్యాయి. అప్పనపల్లి మలుపు నుంచి పెదపట్నంలంక వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డులో కొంత మేర సీసీ రోడ్డు నిర్మించేందుకు కార్యాచరణ చేపట్టారు. గోదావరి వరదలకు దెబ్బతిన్న ఈ రోడ్డుకు ఇప్పటికే రూ.25 లక్షలు నిధులు మంజూరు చేశారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తైన తర్వాత మిగిలిన రోడ్ల అభివృద్ధి పనులు చేపడతామని ఆర్అండ్‌బీ ఏఈ సత్యనారాయణ 'సాక్షి'కి తెలిపారు.

దండు పుంత రోడ్డుకు మరమ్మతులు

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రానికి మోరి గ్యాస్ కలెక్షన్ స్టేషన్ వద్ద నుంచి కేశవదాసుపాలెం, అంతర్వేదికర మీదుగా వెళ్లే దండుపుంత రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. సుమారు 10 కిలోమీటర్ల పొడవైన ఈ రోడ్డు గుర్రాలక్క ఆలయం మీదుగా పుణ్యక్షేత్రానికి వెళుతుంది. తీర్థానికి భక్తుల రాకపోకలు సాగించే మార్గాల్లో దండుపుంత మార్గం కూడా అత్యంత ప్రధానమైంది. ఇప్పటికే పుణ్యక్షేత్రానికి వెళ్లే అన్ని రహదారుల మరమ్మతులు పూర్తి చేసిన అధికారులు దీనిని కూడా పూర్తి చేస్తున్నారు.

మరమ్మతులు పూర్తి

ఆలమూరు: మండలంలోని కొత్తూరు–వెదురుమూడి రోడ్డులో చేపట్టిన మరమ్మతులు పూర్తయ్యాయి. సుమారు రూ.15 లక్షలతో నిర్మించిన ఈ పనులు పూర్తి కావడంతో వాహనదారులకు ప్రయాణం సులభతరమైంది. స్థానిక సంధిపూడి గ్రామ సరిహద్దు దాటిన తరువాత కిలోమీటరు మేర రోడ్డును పూర్తిగా నిర్మించారు. అలాగే బెర్మ్‌లు ప్రమాదభరితంగా ఉన్నచోట గ్రావెల్‌తో సర్దుబాటు చేస్తామని మండపేట ఇన్‌చార్జి ఆర్అండ్‌బీ జేఈ పి.సూర్యనారాయణరావు అన్నారు.

రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలి



ఈతకోట టోల్‌ప్లాజా వద్ద హెల్మెట్ పెట్టుకున్న వాహనదారుడికి గులాబీ ఇప్పిస్తున్న అధికారులు

రావులపాలెం: వాహనదారులు రహదారి భద్రతా ప్రమాణాలను పాటించడంతో ప్రమాదాలు జరగకుండా రక్షణ పొందవచ్చని ఎంవీఐ వి.శ్రీనివాస, సీఐ ఎన్.రజనీకుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఈతకోట టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులకు రవాణాశాఖ, పోలీస్‌శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 18 నుంచి 24 తేదీ వరకూ నిర్వహించనున్న రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా వాహనదారులకు నిబంధనలు, అపరాధ రుసుములపై అవగాహన కల్పించారు. పాఠశాల విద్యార్థులతో నిబంధనలు పాటిస్తున్న వాహనదారులకు గులాబీపువ్వు ఇప్పించి అభినందనలు తెలిపారు. పాటించని వారికి ప్రమాదాల వల్లే కలిగే అనర్థాలను వివరించారు. అలాగే సీట్‌బెల్ట్, హెల్మెట్, రిఫ్లెక్టర్స్ లేని వాహదారులకు రూ.వెయ్యి అపరాధ రుసుం విధిస్తున్నట్లు వివరించారు. ఎంవీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ సీటుబెల్ట్ ధరించడంతో ప్రమాదాల సమయంలో ప్రాణపాయ స్థితి నుంచి బయటపడతారన్నారు. అలాగే సీటుబెల్ట్ ధరిస్తేనే కారులో ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకుంటాయని, అలాగే ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించకపోవడవంతో ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నట్టు గణాంకాలు ఉన్నాయన్నారు. గూడ్స్ వాహనాలకు వెనుక రిఫ్లెక్ట్ స్టిక్కర్లు అతికించి వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై ఎం.వెంకటరమణ, ఏఎంవీఐ కేవీ నాగేంద్ర, టోల్‌ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హరిహరులకు పూజలు

కొత్తపేట: నూతన సంవత్సరంలో తొలి మాసశివ రాత్రి పర్వదినం పురస్కరించుకుని స్థానిక హరిహర దేవాలయం ప్రాంగణంలో వివిధ ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. మాసశివరాత్రి కమిటీ కన్వీనర్ కీర్తి వెంకటేశ్వరరావు, సభ్యులు కొంపెల్ల వెంకటేశ్వరశర్మ, కీర్తి మూర్తి తదితరుల ఆధ్వర్యంలో అర్చకులు, భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకూ వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ప్రాంగణంలో వేంచేసిన రాజరాజేశ్వరీ సమేత రాజరాజేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, రాజరాజేశ్వరీదేవికి సామూహిక కుంకుమ పూజలు, శ్రీ, భూ సహిత వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు, లక్ష తులసిపూజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సదుపాయాల కల్పనకు కృషి

అంబాజీపేట: పీహెచ్‌సీలో సదుపాయాల కల్పనకు కృషి చేసి అభివృద్ధికి బాటలు వేస్తామని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీలో అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఐ.రత్నంరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై ప్రజలకు తెలియపర్చాలన్నారు. సోమవారం, బుధవారం, శుక్రవారం పీహెచ్‌సీకి చెవి, ముక్కు, ఆర్థోపెడిక్, గర్భిణుల వైద్యనిపుణులు హాజరవుతున్నారని గ్రామాల్లో ప్రజలకు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారులు వి.గౌతమి, శ్రీనివాస్‌లు ఆస్పత్రిలో అందిస్తున్న సేవలను వివరించారు. పీహెచ్‌సీకి తాగునీరు అందించేందుకు పైపులైన్లను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం పీహెచ్‌సీ ప్రాంగణాన్ని పరిశీలించారు. సమావేశంలో యూడీసీ ప్రసాద్, సీహెచ్‌ఓ బి.అప్పారావు, సూదాబత్తుల రాము తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందించాలి

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సమర్థవంతంగా లబ్ధిదారులకు అందించాలని ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ అన్నారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ ఉద్యోగులతో మండల అభివృద్ధి, పథకాల అమలుపై శుక్రవారం సమీక్ష జరిగింది. ఈసందర్భంగా ప్రభుత్వ పథకాలు అమలు– గ్రామ సచివాలయ ఉద్యోగుల పాత్రను వివరిస్తూ ఎంపీడీఓ జాన్‌లింకన్ ప్రసంగించారు. పేద ప్రజలకు మెరుగైన ఆరోగ్య రక్షణకు ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అర్హులందరికీ వర్తింపజేయాలన్నారు. గ్రామ వలంటీర్లతో సంక్షేమ పథకాలను అందించవలసిన బాధ్యత సచివాలయ సిబ్బందిదేనని తెలిపారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో అనుకున్న లక్ష్యాలను పంచాయతీ కార్యదర్శులు సాధించాలన్నారు. ఈఓపీఆర్‌డీ పిఆర్‌సీ రాజ్‌కుమార్, సూపరింటెండెంట్ వి.రామస్వరూప్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీవనియంత్రణ పద్ధతులతోనే అధిక లాభాలు



రైతులకు వివిధ రకాల కీటక నాశినులను పంపిణీ చేస్తున్న శ్రీనివాసులు

అంబాజీపేట: కొబ్బరి, కోకో పంటలలో జీవనియంత్రణ పద్ధతుల ద్వారా సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక లాభాలు పొందాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ బి.శ్రీనివాసులు అన్నారు. అఖిల భారత వన్యతోటల పంటల సమన్వయ పథకం, షెడ్యూల్ కుల ఉపప్రణాళిక కార్యక్రమంలో భాగంగా షెడ్యూల్ కులాల కొబ్బరి, కోకో రైతులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులు ప్రస్తుత తరుణంలో అన్ని పంటలపై జీవనియంత్రణ విధానాలే వాడి అధిక దిగుబడులు పొందాలన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరం అరటి సంవత్సరంగా పేర్కొన్న సందర్భంగా అరటి, కొబ్బరి, కోకో తదితర పంటలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో అవగాహన కల్పించారు. ఎనిమిది మంది షెడ్యూల కులాల రైతులకు ట్రైకోడెర్మా విరిడి, సూడోమోనాస్ ఫ్లోరిజెన్స్, బదనికలను పంపిణీ చేశారు. అంతకుముందు కొబ్బరి మరియు కోకోలో జీవనియంత్రణ పద్ధతుల ద్వారా సస్యరక్షణ ప్రచురణలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వి.అనూష, డాక్టర్ జి.కోటేశ్వరరావు, అంబాజీపేట, అమలాపురం ఉద్యాన శాఖ అధికారి దిలీప్, విస్తరణ సిబ్బంది, రావేప్ వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి

సఖినేటిపల్లి: రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర కో ఆపరేటివ్ సెల్ డైరెక్టర్ మాలే శ్రీనివాస నగేష్ అన్నారు. శుక్రవారం అంతర్వేదిలో మండల బీజేపీ అధ్యక్షుడు చెంపాటి శివరామకృష్ణంరాజు అధ్యక్షతన పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో నగేష్ మాట్లాడుతూ, కేంద్రం అమలు చేస్తున్న పథకాల గురించి, ఇస్తున్న నిధుల గురించి కార్యకర్తలు ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కాగా అంతర్వేది తీర్థంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని పార్టీ నాయకులు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆలయంలో ఆయనకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని నగేష్ అందజేశారు. వెంట పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి ఎమ్మెల్యే సాయం



బాలుడి తల్లికి రూ.30 వేల సాయం అందిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

అమలాపురం టౌన్/కొత్తపేట: సంక్రాంతి వేడుకల్లో ఓ ఆలయ భవనం నుంచి ఆర్కెస్ట్రా తిలకిస్తున్న కొత్తపేటకు చెందిన బాలుడు సత్యసాగర్ (12) ప్రమాదవశాత్తూ కిందపడి ముఖానికి తీవ్ర గాయమైంది. అమలాపురం సాయి సంజీవిని ఆసుపత్రిలో అతను చికిత్స పొందుతున్నాడు. బాధితుడిని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. ఆసుపత్రి వైద్యులతో మాట్లాడారు. సత్యసాగర్ వైద్యానికి తన వంతు సాయంగా జగ్గిరెడ్డి రూ.30 వేలు అందించారు. సంక్రాంతి రోజున సాయి సంజీవిని ఆసుపత్రి వైద్య దంపతులు డాక్టర్ పవన్‌కుమార్, సాయిశిల్ప దాదాపు 6 గంటల పాటు శ్రమించి సత్యసాగర్‌కు శస్త్రచికిత్స చేశారు. అతని ముఖంలో రాళ్లు, ఇసుక, ఊచలు దిగబడి పోయిన క్రమంలో అత్యవసర శస్త్రచికిత్స చేయడంతో వైద్యులను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అభినందించారు. అలాగే అమలాపురానికి చెందిన శెట్టిబలిజ యువజన సంఘ అధ్యక్షుడు వాసంశెట్టి సుభాష్, గంధం పల్లంరాజుతో కూడిన అమలాపురం యువకులు వైద్య దంపతులను సత్కరించారు. అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, కొత్తపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.


కొమరాజులంకలో అగ్ని ప్రమాదం



మంటల్లో కాలిపోతున్న వెదురు కర్రలు, చెట్లు

రావులపాలెం: మండలంలోని కొమరాజులంక శ్రీనివాసనగర్ పంట పొలాల సమీపాన శుక్రవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో వెదురుకలప మంటల్లో దగ్ధమయింది. స్థానికులు, కొత్తపేట అగ్నిమాపకాధికారి తెలిపిన వివరాల ప్రకారం కొమరాజులంకకి చెందిన కర్రి సత్యనారాయణరెడ్డి పంట పొలంలో మామిడిచెట్టుకు నిలబెట్టి ఉన్న సుమారు 4 వేల వెదురుకర్రల కలప ఉంది. మధ్యాహ్న సమయంలో సమీపంలో ఉన్న పొలాల్లో తేగలు కాల్చడంతో ఆ నిప్పు రవ్వలు ఎగిసిపడి వెదురు కర్రలు అంటుకున్నాయి. క్షణాల్లో మంటలు ఎగసిపడ్డాయి. స్థానికులు మంటలు అదుపు చేయడానికి ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. ఇంతలో సమాచారం అదుకున్న కొత్తపేట అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో సంఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల విలువైన వెదురు కర్రలు, మామిడి చెట్టు, కొబ్బరి చెట్టు మంటల్లో కాలిపోయినట్టు ఇన్‌చార్జి ఫైర్ అధికారి బి.ప్రభాకరరావు తెలిపారు.

గ్రామస్తుల సహకారంతో ఇంటింటికీ తాగునీరు



బిళ్లకుర్రు జేజేఎం అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సర్పంచ్ లక్ష్మీపతిరావు

కొత్తపేట: జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటి సరఫరాకు గ్రామస్తుల సహకారం అవసరమని బిళ్లకుర్రు సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు అన్నారు. మండలంలోని బిళ్లకుర్రు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం చాంద్ ఇంప్లిమెంట్ సపోర్టింగ్ ఏజెన్సీ (ఐఎస్ఏ) ఎన్‌జీఓ ఆధ్వర్యంలో జల్‌జీవన్ మిషన్ కార్యక్రమాలపై సర్పంచ్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఐఎస్ఏ టీమ్ లీడర్ గంగాధర్ మాట్లాడుతూ గ్రామంలో సర్పంచ్ అధ్యక్షుడిగా, కార్యదర్శి కన్వీనర్‌గా 10 నుంచి 20 మంది వీడబ్ల్యూఎస్ కమిటీగా ఏర్పడి పైపులైన్లను పర్యవేక్షించాలన్నారు. ఆ కమిటీ పేరున బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి ప్రతి కుటుంబం నుంచి కొంత మొత్తాన్ని వసూలు చేసి నిధిని ఏర్పాటు చేసుకోవా లన్నారు. ఆ నిధిని పైపులైన్ల రిపేర్లకు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాంబాబు, టీమ్ లీడర్ నాగేంద్ర, ఈఏ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య రైతు సంఘ అధ్యక్షుడిగా ప్రసాద్

అంబాజీపేట: వ్యాఘ్రేశ్వర ఐక్య రైతు సంఘ అధ్యక్షుడిగా కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా అడబాల రాజారావు ఎన్నికయ్యారు. పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో ఐక్య రైతు సంఘ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కొల్లి వెంకట్రావు, ఉపాధ్యక్షుడిగా ఎ.శ్రీనివాసరావు, తదితరులను ఎన్నుకున్నారు.

సంక్షిప్తంగా..

16 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

ధవళేశ్వరం: ధవళేశ్వరం నుంచి ఆలమూరు మండలం నర్సిపూడి గ్రామానికి వ్యాన్‌లో తరలిస్తున్న 16 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం మేరకు ధవళేశ్వరం రాఘవేంద్రస్వామి గుడి సమీపాన శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 32 సంచుల్లో తరలిస్తున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేశారు. ఆ బియ్యం విలువ రూ.2,10,800 ఉంటుందని అధికారులు వెల్లడించారు. వాహనం డ్రైవర్ మాధురి హనుమంతు, యజమాని ఉండమట్ల వెంకటనాగేంద్ర, రేషన్ బియ్యం కలిగిన చాపా వెంకన్నపై కేసు నమోదు చేయాలని ధవళేశ్వరం పోలీసులకు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సత్యకిషోర్, హెడ్ కానిస్టేబుల్ జీవానందం, కానిస్టేబుల్ లోవరాజు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదుల తనిఖీ

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంక గ్రామంలో ఈ– క్రాప్‌లో నమోదైన వరి చేలను తహసీల్దార్ వీవీ నరసింహారావు శుక్రవారం పరిశీలించారు. వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందితో కలసి సాగు చేస్తున్న వరి చేలలోకి వెళ్లి నేరుగా పరిశీలించారు. ప్రభుత్వం నిబంధనల మేరకు తనిఖీ నిర్వహించినట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. నమోదు ప్రకారం తనిఖీ చేసిన సర్వే నంబరు భూమికి సంబంధించిన వరి చేలో సాగు జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. వీఆర్వో సీతారాముడు, అగ్రికల్చర్ అసిస్టెంట్ సందీప్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

అంబాజీపేట: ప్రమాదవశాత్తూ స్టౌ నుంచి మంటలు చెలరేగి గాయపడిన ఓ వివాహిత చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. దీనికి సంబంధించి అంబాజీపేట పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తొండవరం ముహూర్తాల చెరువుగట్టు వద్ద ఉన్న పుట్టింటి వద్ద కముజు వాణి(బాలింత) (25) ఉంటోంది. గత ఏడాది డిసెంబర్ 15వ తేదీ సాయంత్రం ఇంటి వద్ద పాలు వేడిచేస్తుండగా స్టౌ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి వాణికి నిప్పంటుకుందన్నారు. దాంతో క్షతగాత్రురాలిని అమలాపురం కిమ్స్‌కు తరలించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రైవేట్ ఆస్పత్రిలో తరలించగా ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి మట్టపర్తి ఉమా ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వై.సూర్యనారాయణ తెలిపారు.

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

పి.గన్నవరం: స్వామి వివేకానందుడిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. వివేనందుని జయంతి వారోత్సవాల్లో భాగంగా ఆపార్టీ మండల అధ్యక్షుడు గొలకోటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం బెల్లంపూడి సత్యజ్యోతి స్కూలు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలో విజేతలకు అయ్యాజీ వేమా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మీయ ఆతిథ్యానికి గ్రామస్తుల సన్మానం

అంబాజీపేట: సంక్రాంతి పండగను పురస్కరించుకుని గ్రామస్తులతో పాటు వివిధ ప్రాంతాల్లో ఉంటూ గంగలకుర్రు వచ్చిన ప్రవాస గ్రామస్తులకు నాలుగు రోజుల పాటు విందు భోజనాన్ని ఆత్మీయంగా అందించడంతో శుక్రవారం రాత్రి గ్రామస్తులు సన్మానం చేశారు. గంగలకుర్రుకు చెందిన తనికెళ్ల విశ్వనాథం కుమారులు మాజీ సర్పంచ్ తనికెళ్ల మణిబాబు, తనికెళ్ల లక్ష్మీనరసింహమూర్తిలను స్థానిక లలిత పరమేశ్వరి కల్యాణ మండపంలో బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన గ్రామస్తులకు, ప్రవాస గ్రామస్తులకు నాలుగు రోజుల పాటు భోజనాలు అందించారు. ఇందుకు గ్రామస్తులు కృతజ్ఞతలతో సోదరులు ఇరువురిని ఘనంగా సత్కరించారు. తొలుత వేదపండితులు వేద ఆశీర్వాదం చేశారు. కార్యక్రమంలో చిట్టావఝ్జల సూర్యారావు, సుబ్బారావు, ఆకెళ్ల కృష్ణ, శాంతరామం, భమిడిపాటి బాబి, తదితరులు పాల్గొన్నారు.